ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

సోమవారం 2 డిసెంబరు 2024

వర్షబాధితుల కోసం
వైద్య సహాయం

● చెన్నై సహా 7 జిల్లాల్లో శిబిరాలు



గిండి మడువిన్‌కరైలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగాల్ తుఫాన్ కారణంగా వరద పరిస్థితులు నెలకొన్న చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం సహా ఏడు జిల్లాల్లో ఆదివారం ఉదయం ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. గత రెండు రోజులుగా కుండపోతగా కురిసిన వర్షాల వలన అంటు వ్యాధులు ప్రబలకుండా చెన్నైలో 200 చోట్లా, తక్కిన ఆరు జిల్లాల్లో జిల్లాకు 50 చొప్పున వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆరోగ్యశాఖమంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. గిండి మడువిన్‌కరై ప్రాంతంలో ఏర్పాటైన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాల వల్ల కలిగే జ్వరాలు, జలుబు, దగ్గు తదితర సమస్యలకు ఈ వైద్యశిబిరాలలో వైద్యపరీక్షలు చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు ఈ వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గత ఒకటిన్నర నెలలుగా నిర్వహించిన వైద్య శిబిరాలల్లో సుమారు 18.02 లక్షలమంది లబ్ధి పొందినట్లు ఆయన చెప్పారు.



మంగళాపురంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

నత్తనడకన
తీరం దాటిన ఫెంగల్

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను నత్తనడకన ఆదివారం సాయంత్రానికి పూర్తిగా తీరాన్ని దాటిందని భారత వాతావరణ పరిశోధన కేంద్రం దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ తెలిపారు. ఫెంగల్ తుఫాన్ శనివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో నెమ్మదిగా తీరంవైపు కదిలి, రాత్రి 10.30 నుంచి 11.30 గంటల మధ్య ముప్పావు శాతం వరకు తీరాన్ని దాటిందని చెప్పారు. అయితే ఆ తుఫాన్ పుదుచ్చేరి తీరం వద్దే కేంద్రీకృతమై ఆరుగంటలపాటు గంటకు 7 కి.మీల వేగంతో నత్తనడకన కదిలి బలహీనపడి పుదుచ్చేరి, విల్లుపురం, కడలూరు జిల్లాల వైపు కదిలిందని ఈ కారణంగానే ఆ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీంతో విల్లుపురం, కళ్ళకురిచ్చి, కడలూరు జిల్లాలకు పుదుచ్చేరి రాష్ట్రానికి ఆదివారం కూడా రెడ్ అలెర్ట్ ప్రకటించామని, అదే విధంగా చెంగల్పట్టు, కాంచీపురం, తిరువణ్ణామలై, ధర్మపురి, సేలం, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై, నాగపట్టినం, కారైక్కాల్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించామని, ఆ జిల్లాల్లో ఆదివారం ఓ మోస్తరుగానే వర్షాలు కురిశాయని ఆయన వివరించారు.

పుదుచ్చేరి, కడలూరు, విల్లుపురంలో
తుపాను బీభత్సం

కుండపోతగా వర్షం ● లోతట్టు ప్రాంతాల జలమయం ● సహాయక చర్యలు ముమ్మరం



నీట మునిగిన విల్లుపురం బస్టాండు

కడలూరులో జలదిగ్బంధంలో చిక్కుకున్న నివాస ప్రాంతాలు

కడలూరులో కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఫెంగల్ తుఫాన్ తీరం దాటి పుదుచ్చేరి రాష్ట్రాన్ని, కడలూరు, విల్లుపురం జిల్లాలను కుదుపేసింది. ఈ మూడు ప్రాంతాల్లో కుండపోత వర్షాలకు జలమయంగా మారాయి. పుదుచ్చేరిలో సైనికులు, అగ్నిమాపక సిబ్బంది, ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రతిస్పందన బృందం సభ్యుల యుద్ధ ప్రాతిపదికన సహాయకచర్యలు చేపట్టారు. ఫెంగాల్ తుఫాన్ శనివారం సాయంత్రం మహాబలిపురానికి 50 కి.మీ.ల దూరంలో మాటువేసింది. ఆ తర్వాత నెమ్మదిగా నైరుతి దిశగా కదులుతూ కారైక్కాల్, మహాబలిపురం మధ్య పుదుచ్చేరి సమీపంలో తీరం దాటింది. రాత్రి 10.30 నుండి 11.30 గంటల ప్రాంతంలో తుఫాన్ ప్రధాన భాగం తీరం దాటుతున్నప్పుడు గంటకు 90 కి.మీ. వేగంతో పెనుగాలులు వీచాయి. కుండపోతగా వర్షాలు కురిశాయి. ఆ సమయంలో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పుదుచ్చేరి నగరమంతా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సముద్రతీర గ్రామల్లో నివసిస్తున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫెంగల్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి ఆదివారం వేకువజాము 5.30 గంటల దాకా 51 సెం.మీల వర్షపాతం నమోదైంది. వర్షాలకు పుదుచ్చేరి వైట్ టౌన్, కృష్ణానగర్, వెంకటా నగర్, చిత్తన్‌కుడి, భూమియాన్‌పేట, ఇందిరా స్క్వేయర్, వందడుగుల రోడ్డు, అన్నానగర్, ఈస్ట్ కోస్ట్ రోడ్డు, తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పారు వాగు సమీపంలోని గోవిందా రోడ్డు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ తుఫాన్ కారణంగా పుదుచ్చేరిలో వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. సుమారు ఐదువేలమంది ప్రభుత్వ ఉద్యోగులు వరద బాధితులకు సహాయక చర్యలు అందిస్తున్నారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి పర్యవేక్షణలో స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా వర్షబాధితులకు అన్నపానీయాలు అందించి ప్రత్యేక శిబిరాలలో బస సదుపాయం కూడా కల్పించారు.

విల్లుపురం జిల్లాలో...

విల్లుపురం జిల్లాలోనూ ఫెంగల్ తుఫాన్ బీభత్సాన్ని సృష్టించింది. విల్లుపురం జిల్లా విక్రవాండి ప్రాంతంలో శనివారం ఉదయం నుండి భారీ వర్షాలు కురిశాయి. వాతావరణ పరిశోధన కేంద్రం అధికారుల అంచనాలకు వ్యతిరేకంగా ఫెంగల్ తుఫాను ప్రభావంతో విల్లుపురం జిల్లా అంతటా కుండపోత వర్షాలు కురిశాయి. 42 యేళ్ల తర్వాత విల్లుపురంలో 50 సెం.మీ.ల మేర వర్షం కురిసిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సాత్తనూరు డ్యామ్‌లో నీటి మట్టం పెరుగుతుండటంతో ఆ డ్యామ్ నుంచి సెకనుకు 36 వేల ఘనపుటడుగులచొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ఆనీరు వీడూరు జలాశయంలోకి చేరటంతో ఆ జలాశయం ప్రమాద స్థితికి చేరింది. దీనితో అక్కడి నుంచి ఆరు క్రష్‌గేట్ల ద్వారా అదనపు జలాలను శంకరపాణి డ్యామ్‌లోకి విడుదల చేశారు. ఈ కారణంగా విక్రవాండి, వీడూరు వద్దనున్న పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదే విధంగా మరక్కాణం తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అక్కడి చెరువులు నిండి పొంగి ప్రవహించడంతో రహదారులు జలమయమయ్యాయి. ఈ వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కడలూరులో...

కడలూరు జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం వేకువజాము వరకూ కుండపోతగా వర్షం కురవడంతో కడలూరు కూత్తంబాక్కం, విల్వనగర్ ప్రాంతాల్లోని ఇళ్లన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తెన్పెన్నైయారు, కొడిలం వాగు సహా ప్రధాన చెరువులన్నీ నీటితో నిండి పొంగి ప్రవహించాయి. దేవానంపట్టి, తాళంగుడా వంటి సముద్రతీర ప్రాంతాల్లో రాక్షస అలలు ఎగసిపడ్డాయి. తిరుప్పాదిరిపులియూరు, మంజకుప్పం, ముత్తునగర్ తదితర ప్రాంతాలు దీవులుగా మారాయి. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



జలమయమైన పుదుచ్చేరి రహదారి

తుఫాన్ నష్టాలపై అంచనాకు
బృందాన్ని పంపండి

● కేంద్రానికి సీఎం స్టాలిన్ వినతి



కొళత్తూరు సెల్వినగర్‌లో వాననీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగాల్ తుపాను తాకిడికి గురై తీవ్రంగా నష్టపోయిన చెన్నై సహా ఏడు జిల్లాల ప్రజలను ఆదుకునే దిశగా కేంద్రం తక్షణమే బృందాన్ని పంపాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఆదివారం ఉదయం కొళత్తూరు నియోజకవర్గంలో వర్షబాధిత ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. మెరీనా బీచ్ ఎళిలగమ్ భవనంలోని కంట్రోలు రూమ్ సందర్శించి తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన విల్లుపురం, కడలూరు తదితర జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాధితులకు అందుతున్న సహాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫెంగల్ తుపాను రాజధాని నగరం చెన్నైకి తక్కువ నష్టమే జరిగిందని, భారీ వర్షాలు కురిసినప్పటికీ రహదారులలో, ప్రధాన వీధులలో వాననీటిని ఎప్పటికప్పుడు తొలగించి వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ తుపాను ఊహించని విధంగా విల్లుపురం జిల్లాలో వర్షబీభత్సాన్ని కలిగించిందని, గడిచిన 24 గంటల్లో విల్లుపురం జిల్లా మయిలం ప్రాంతంలో 49 సెం.మీల వర్షపాతం, నెమ్మేలిలో 46 సెం.మీ.లు, వానూరులో 41 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. విల్లుపురం జిల్లాల్లో వర్షబాధితులకు సహాయకచర్యలు చేపడుతున్న మంత్రి పొన్ముడితో పాటు మంత్రులు శివశంకర్, సెంథిల్‌బాలాజీని కూడా ఆ జిల్లాకు పంపినట్లు చెప్పారు. ఇక కడలూరు జిల్లాలో మంత్రులు ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, సీవీ గణేశన్ వర్షబాధితులకు సహాయక కార్యక్రమాలను చేపడుతున్నారని, ఫెంగల్ తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా ఇంకా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని, వర్షాలు తగ్గిన తర్వాత నష్టాలను అంచనా వేయగలమని చెప్పారు. అదే విధంగా పంట నష్టాలను తెలుసుకునేందుకు కూడా వర్షం తగ్గిన తర్వాతే అధికారులను పంపగలమని తెలిపారు. సోమవారం సచివాలయంలో అధికారులతో సమావేశమైన తర్వాత కేంద్ర పరిశీలక బృందాన్ని రాష్ట్రానికి పంపమని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, సీనియర్ ఐఏఎస్ అధికారులను వర్షబాధిత జిల్లాల్లో పరిశీలన చేసి, బాధితులకు సహాయక కార్యక్రమాలను అందజేస్తున్నామని స్టాలిన్ చెప్పారు. చెన్నైలో 32 సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి, 1018 మంది వర్షబాధితులకు బసకల్పించి ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇక నగరమంతటా 9.10 లక్షల మంది బాధితులకు ఆహారపొట్లాలు పంపిణీ చేశామన్నారు.

చెన్నైలో ఐదుకు పెరిగిన మృతుల సంఖ్య

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా మరణించిన వారి సంఖ్య ఐదుకు పెరిగింది. వీరంతా విద్యుదాఘాతానికి బలవడం గమనార్హం. ఫెంగల్ తుపాను కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు సైతం జలమయమయ్యాయి. బ్రాడ్‌వే ప్రాంతంలోని ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎంలో నగదు విత్ డ్రా చేసేందుకు వెళ్లిన శాంతన్ అనే ఉత్తరాది కార్మికుడు విద్యుత్ షాక్‌కు మరణించాడు. అదే విధంగా వేళచ్చేరి విజయనగర్ రెండో మెయిన్ రోడ్డు జంక్షన్‌లో గాలుల కారణంగా తెగిన విద్యుత్ తీగను శక్తివేల్ తొక్కడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందారు. కాగా, వ్యాసర్పాడి గణేశపురం ప్రాంతం సబ్‌వేలో చేరిన వరద నీరు తొలగించేందుకు వెళ్లిన ఇసైవానన్ విద్యుత్ షాక్‌తో మరణించాడు. ఒడిశాకు చెందిన పులవేశ్వర్ (20) వానాగరంలో జరుగుతున్న భవన నిర్మాణపనుల్లో పాల్గొని విద్యుత్ మోటరు ఆన్ చేసే ప్రయత్నంలో మరణించాడు. అంబత్తూర్ మూనంబేడు పిళ్లయార్ ఆలయ వీధికి చెందిన విఘ్నేష్ (37) ఇంటి ముందు తెగిపడిన వైరు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఐదు మరణాలపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రభుత్వం తరపున తలా రూ.5 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు.

వరద నీరు తొలగించాకే పాఠశాలలు

● మంత్రి అన్బిల్ మహేష్

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చేరిన వరద నీరు పూర్తిగా తొలగించాకే తరగతులు ప్రారంభించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆదేశించారు. మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనం పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిన మంత్రి అన్బిల్ మహేష్‌ను తిరుచ్చిలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తుపాను కారణంగా ముందస్తు జాగ్రత్తగా చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాలే కాకుండా భారీవర్షాలు కురిసిన జిల్లాలో పాఠశాలలకు సెలవు ప్రకటించామని, ఈ పాఠశాలలు ప్రారంభించే ముందు ఆయా జిల్లాల కలెక్టర్లు పాఠశాలను పరిశీలించి, ప్రాంగణాల్లో వరద నీటిని తోడించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు చదువుకొనేలా వసతులు కల్పించాల్సిందిగా ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

నేడు విల్లుపురం, పుదుచ్చేరిలో విద్యా సంస్థలకు సెలవు

వేళచ్చేరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను తీరం దాటినా పుదుచ్చేరి, విల్లుపురం జిల్లాల్లో విస్తారంగా వర్షాలకు కురుస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో ఇంకా జనావాసాలు, రోడ్లపై నీరు చేరింది. ఈ క్రమంలో, పుదుచ్చేరి రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. అలాగే, విల్లుపురం జిల్లాలోనూ విద్యాసంస్థలకు ఆ జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

2026 ఎన్నికలు
కొత్త చరిత్ర సృష్టిస్తాయి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగబోయే ఎన్నికలు చరిత్ర సృష్టిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అభిప్రాయపడ్డారు. లండన్‌లో మూడు నెలల చదువు పూర్తిచేసికొని ఆదివారం నగరానికి తిరిగిరాగా, ఆయనకు బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... లండన్ వెళ్లి చదువుకొనేందుకు అనుమతించిన బీజేపీ పెద్దలకు, రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కృషి చేసిన పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు ద్రావిడ పార్టీలకు చెందినవిలాగే ఉన్నాయని, తమిళగ వెట్రి కళగం మహానాడు అనంతరం విజయ్ ప్రజలను తక్కువ సార్లు కలుసుకున్నారన్నారు. రాష్ట్రంలో ద్రావిడ పార్టీలు మూడుగా చీలాయని, ఈ పార్టీల సిద్ధాంతాల గురించి విజయ్ మాట్లాడుతున్నారని అన్నామలై అన్నారు. 2026లో అసెంబ్లీకి జరుగబోయే ఎన్నికలు తప్పనిసరిగా చరిత్రను సృష్టించే విధంగా ఉంటాయని, ఆ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా తన ప్రయాణం సాగుతుందన్నారు.

వాకింగ్‌లో పెనువిషాదం

● ముగ్గురిని బలిగొన్న చేపల వ్యాన్



మృతులు చెల్లయమ్మాల్, నిర్మల, మలైయన్నన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా మోగనూరులో వాకింగ్ చేస్తున్న వారిపై ఆమ్నీ వ్యాన్ దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మృతి చెందారు. కాట్టూర్ ప్రాంతానికి చెందిన మలైయన్నన్ (68), ఆయన భార్య నిర్మల (55), అదే ప్రాంతానికి చెందిన చెల్లమ్మాళ్ (65) రోజూ సమీపంలోని రోడ్డు పక్కనే వాకింగ్ చేస్తుంటారు. ఆదివారం ఉదయం 6 గంటలకు నామక్కల్-మోగనూరు రోడ్డు పక్కన ముగ్గురు వాకింగ్ చేస్తున్న సమయంలో నామక్కల్ నుంచి చేపల లోడుతో వస్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి వాకింగ్ చేస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మలైయన్నన్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన చెల్లమ్మాళ్, నిర్మలను నామక్కల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, మినీ వ్యాన్ డ్రైవర్ మోగనూరు ప్రాంతానికి చెందిన మణికంఠన్‌కు కూడా గాయాలు కావడంతో నామక్కల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి కారణమైన వాహనం

సమాచార దర్శిని

'అవ్వైయార్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మహిళాభివృద్ధికి కృషిచేస్తున్న వారు 'అవ్వైయార్' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2025 మార్చిలో ముఖ్యమంత్రి ఈ పురస్కారం అందజేయనున్నారు. రాష్ట్రానికి చెందిన 18 ఏళ్లకు పైబడిన వారు https:.//awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

స్టాంపుల ఎగ్జిబిషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) నగరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి తపాలా స్టాంపుల ఎగ్జిబిషన్‌లో, తాము సేకరించిన స్టాంపులు ప్రదర్శించేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 9వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తపాలా శాఖ తెలిపింది. షేనాయ్ నగర్‌లోని అమ్మ ఆడిటోరియంలో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1వ తేది వరకు రాష్ట్రస్థాయి తపాలా స్టాంపుల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. విద్యార్థులకు తపాలా స్టాంపుల సేకరణపై ఆసక్తి కలిగించేలా ఏర్పాటుచేయనున్న ఈ ఎగ్జిబిషన్‌లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు అన్ని తపాలా కార్యాలయాల్లో లభిస్తాయి. https:.//tamilanad upost. cept. gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా నమోదుచేసుకోవచ్చని తపాలా శాఖ తెలిపింది.

సేలం నుంచి 30 వేల లీటర్ల పాల దిగుమతి

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాను ప్రభావంతో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి. ఈ నాలుగు జిల్లాల్లోని పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరద బాధితులకు కొరత లేకుండా పాలు సరఫరా చేసేందుకు ఆవిన్ సంస్థ చర్యలు చేపట్టింది. అందుకోసం బాధిత జిల్లాల్లో విక్రయించేందుకు సేలం పాల కేంద్రం నుంచి శని, ఆదివారాల్లో 30 వేల లీటర్ల పాల ప్యాకెట్లు దిగుమతి చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

10 వరకు జరిమానా లేకుండా విద్యుత్ బిల్లులు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ఈ క్రమంలో, విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నాలుగు జిల్లాల్లో విద్యుత్ బిల్లులు ఈ నెల 10వ తేది వరకు జరిమానా లేకుండా చెల్లించవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రూ.16 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.16 పెరిగింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా ఆయిల్ సంస్థలు ప్రతి నెలా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తుంటాయి. ఆ ప్రకారం, గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1964.50 ఉండగా ఈ నెల రూ.16 పెరగడంతో రూ.1,980.50కు విక్రయమవుతోంది. కాగా, గత నెల వాణిజ్య సిలిండర్ ధర రూ.61.50కి పెరిగిన విషయం తెలిసిందే.

శబరిమల భక్తుల కోసం 540 గదులు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శబరిమల సన్నిధానంలో భక్తులు బసచేసేందుకు 540 గదులు అద్దెకు ఇవ్వనున్నారు. శబరిమలలో వేకువజామున 3.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు నెయ్యి అబిషేకం జరుగుతుంది. మధ్యాహ్నానికి పైగా శబరిమలకు వచ్చే భక్తులు తిరిగి వెళ్లకుండా నెయ్యి అభిషేకం కోసం సన్నిధానంలో బసచేస్తుంటారు. అలాంటి భక్తుల సౌకర్యార్థం 540 గదులు తక్కువ ధర అద్దెతో అందుబాటులో ఉన్నాయి. భక్తులు 'షిజుజోజ్బీభీఛిబౌరు' అనే వెబ్‌సైట్ ద్వారా బస చేసేందుకు 15 రోజుల ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ చేసుకోని భక్తులు బీఎస్ఎన్ఎల్‌కు వెళ్లే మెట్ల దారిలో ఉన్న అకామిడేషన్ కార్యాలయానికి ఆధార్ కార్డుతో సంప్రదించవచ్చు. ఆ సమయంలో గదుల ఖాళీలు బట్టి కేటాయిస్తారు.

ఊటీ-గెత్తి మధ్య 'రౌండ్ ట్రిప్ జాయ్' రైలు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులకు ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. పర్యాటకుల సౌకర్యార్థం ఈ నెల 28 నుంచి జనవరి 2వ తేది వరకు ఊటీకి ప్రత్యేక కొండ రైలు నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం మేట్టుపాళయం నుంచి ఊటీకి ఉదయం 9.10 గంటలకు, ఊటీ నుంచి మేట్టుపాళయానికి 11.25 గంటలకు రెండు రైళ్లు నడుపుతున్నారు. అలాగే, కున్నూర్ నుంచి ఊటీకి ఉదయం 8.20 గంటలకు, ఊటీ నుంచి కున్నూర్‌కు సాయంత్రం 4.45 గంటలకు రెండు రైళ్లు నడుపుతున్నారు. ఈ క్రమంలో, ఊటీ-గెత్తి మధ్య 'రౌండ్ ట్రిప్ జాయ్' పేరుతో ప్రత్యేక రైలు ఉదయం 9.45, 11.35, మధ్యాహ్నం 3 గంటలకు రోజుకు మూడు సర్వీసులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

కుట్రాలానికి పోటెత్తిన అయ్యప్ప భక్తులు



చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతం వద్ద ఆదివారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాదిమంది అయ్యప్ప భక్తులతో సందడిగా మారింది. శబరిమల యాత్రకు వెళ్లే అయప్పభక్తులు కుట్రాలం జలపాతంలో స్నానాలు చేసేందుకు వస్తారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కుట్రాలం ప్రధాన జలపాతం జలకళను సంతరించుకుంది. ఆదివారం వేకువజాము నుండే అయ్యప్ప భక్తులు ఆ జలపాతంలో స్నానాలు చేసేందుకు బారులుదీరారు. స్నానం చేసిన తరువాత అయ్యప్ప భక్తులు చందనం విభూతి, కుంకుమ పెట్టుకోవడానికి దుకాణం యజమానులు ఒక్కో భక్తుడి నుండి రూ.5లను వసూలు చేశారు.

మహిళలు నడిపే కర్మాగారాల్లో

రెండో స్థానంలో రాష్ట్రం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ 'ఉదయం' వెబ్‌సైట్‌లో రాష్ట్రం నుంచి 33 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నమోదయ్యాయి. వాటిలో 6.21 లక్షల పరిశ్రమల మహిళల నేతృత్వంలో జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను క్రమబద్ధీకరించేలా కేంద్ర ప్రభుత్వం 'ఉదయం' సర్టిఫికెట్ అందజేస్తోంది. ఈ సర్టిఫికెట్ పొందిన పరిశ్రమలకు బ్యాంక్ రుణాలు, రాయితీల్లో ప్రాధాన్యత ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో గత నెల 25వ తేది వరకు దేశవ్యాప్తంగా నమోదుచేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వివరాలను కేంద్రం విడుదల చేసింది. అందులో, 50.41 లక్షల పరిశ్రమలతో మహారాష్ట్ర మొదటి స్థానంలో, 30.33 లక్షల పరిశ్రమలతో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. వాటిలో మహిళలు నేతృత్వం వహిస్తున్న సంస్థలు మహారాష్ట్రలో 7.76 లక్షలు, తమిళనాడులో 6.21 లక్షలు మొదటి, రెండవ స్థానాల్లో ఉండగా, తరువాత స్థానాల్లో 3.50 లక్షలతో ఉత్తరప్రదేశ్, 2.87 లక్షలతో కర్ణాటక, 2.36 లక్షలతో గుజరాత్ నిలిచాయి.

ఒకేరోజు 3,500 మెగావాట్లకు తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకేరోజు విద్యుత్ వినియోగం 3,500 మెగావాట్లు తగ్గింది. రాష్ట్ర రోజువారీ విద్యుత్ వినియోగం 15,000 మెగావాట్లు కాగా, ఈ ఏడాది మే 2వ తేది అత్యధికంగా 20,830 మెగావాట్లుగా ఉంది. రాష్ట్రంలో రాజధాని నగరం చెన్నైలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. నగరంలో రోజువారీ విద్యుత్ వినియోగం 2,800-3,000 మెగావాట్లుండగా, మే 31వ తేది అత్యధికంగా 4,769 మెగావాట్లుగా నమోదైంది. ఈ నేపథ్యంలో, 'ఫెంగల్' తుఫాను కారణంగా శనివారం విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కర్మాగారాలు సెలవు ప్రకటించాయి. దీనికి తోడు వర్షాలు కురిసి వాతావరణం చల్లబడడంతో ఇళ్లలో ఏసీల వినియోగం తగ్గింది. దీంతో, శనివారం నగరంలో 1,500 మెగావాట్లు సహా రాష్ట్రవ్యాప్తంగా 3,500 మెగావాట్లకు తగ్గి, రోజువారీ విద్యుత్ వినియోగం 11,500 మెగావాట్లుగా నమోదైంది.

తూత్తుకుడి ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు



ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి ఎయిర్‌పోర్ట్‌లో బాంబు ఉంచినట్లు శనివారం విమానాశ్రయ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. దీంతో, రూరల్ డీఎస్పీ సుధీర్ నేతృత్వంలోబాంబ్ స్క్వాడ్ నిపుణులు, విమానాశ్రయ భద్రతా సిబ్బంది విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా విమానాశ్రయ ప్రాంగణంలో అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా చేశారు. 'ఫెంగల్' తుఫాను కారణంగా శనివారం తూత్తుకుడి-చెన్నై విమాన సర్వీసులు రద్దు చేశారు. బెంగళూరు వెళ్లే ప్రయాణికుల లగేజీ మెటల్ డిటెక్టర్ల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి, బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పుదుకోట పోలీసులు, సైబర్ క్రైం పోలీసుల సాయంతో ఈ-మెయిల్ పంపిన వారి వివరాల కోసం విచారిస్తున్నారు.

నర్సుల టాయిలెట్లో పెన్ కెమెరా

● ట్రైనీ డాక్టర్ వెంకటేష్ అరెస్ట్



పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నర్సుల టాయిలెట్‌లో పెన్ కెమెరా ఉంచిన ట్రైనీ డాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ జిల్లా పొలాచ్చి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు, నర్సులకు వేర్వేరు టాయిలెట్లు ఉన్నాయి. ఈ క్రమంలో, కొద్దిరోజుల క్రితం టాయిలెట్‌కు వెళ్లిన నర్సులు టాయిలెట్ శుభ్రం చేసే బ్రష్‌లో పెన్ కెమెరాను గుర్తించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పొల్లాచ్చి ఈస్ట్ పోలీసులు కేసు నమోదుచేసి, ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై తాలూకా సమీపం పనమరత్తుపట్టికి చెందిన వెంకటేష్‌కు వివాహమై భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కోయంబత్తూర్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న వెంకటేష్, పీజీ కోర్సు నిమిత్తం గత నెల 16వ తేది పొల్లాచ్చి ప్రభుత్వాస్పత్రిలో చేరారు. పది రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా పెన్ కెమెరా కొనుగోలు చేసిన వెంకటేష్, దానిని టాయిలెట్ బ్రష్‌లో అమర్చినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

కోవై ఫుడ్ ఫెస్టివల్‌లో తోపులాట



నిర్వాహకులతో ప్రజల వాగ్వివాదం

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం పలు కార్యక్రమాలు చేపట్టింది. ఆ క్రమంలో, తమిళనాడు కేటరింగ్ సంఘం ఆధ్వర్యంలో కొడీసియా మైదానంలో శని, ఆదివారాల్లో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుచేశారు. ఇందులో సుమారు వందకు పైగా స్టాల్స్ ఏర్పాటుచేయగా, 400 రకాల శాఖాహార, మాంసాహార వంటకాలు, స్వీట్లు, శీతల పానీయాలు, ఫ్రూట్ జ్యూస్ తదితరాలు అందజేశారు. ఇందుకోసం పెద్దలకు రూ.799, పిల్లలకు రూ.499 చార్జీగా నిర్ణయించడంతో పాటు అన్‌లిమిటెడ్ ఫుడ్ అని, ఆన్‌లైన్‌లో ముందుగా నమోదుచేసుకోవాలని నిర్వాహకులు ప్రకటించారు. దీంతో, శనివారం రాత్రి కుటుంబాలతో ప్రజలు మైదానానికి వచ్చారు. కానీ, స్టాల్స్ వద్ద పెద్ద క్యూ లైన్‌లో వేచి ఉన్న వారికి, తగినంత ఆహారం అందచేయలేదంటూ నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. అన్‌లిమిటెడ్ అని లిమిటెడ్‌గా అందించారని మహిళలు వాగ్వివాదం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

సబర్బన్ రైళ్లకు అదనపు హాల్ట్‌లు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని నుంచి నడుపుతున్న సబర్బన్ రైళ్లకు సోమవారం నుంచి అదనపు హాల్ట్ కల్పించనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.43408 అరక్కోణం నుంచి ఉదయం 6.40 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు వెళ్లే ఈఎంయూ ఫాస్ట్ లోకల్ తిరునిండ్రవూర్ రైల్వేస్టేషన్‌లో (7.30 గంటలు) ఆగుతుంది.
- నెం.43216 తిరువళ్లూర్ నుంచి ఉదయం 8.15 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్ వెళ్లే ఈఎంయూ ఫాస్ట్ లోకల్ సెవ్వాపేట (8.21 గంటలు) రైల్వేస్టేషన్‌లో ఆగుతుంది. ఈ రైలు వ్యాసరాప్పడి జీవా స్టేషన్‌లో ఆగదు.
- నెం.07238 అరక్కోణం నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు బయల్దేరే మెము తిరునిండ్రవూర్ (3.12 గంటలు) రైల్వేస్టేషన్‌లో ఆగనుంది.
- నెం.06033 చెన్నై బీచ్ నుంచి సాయంత్రం 6 గంటలకు తిరుమణ్ణామలై వెళ్లే మెము పులియమంగళం (రాత్రి 7.25 గంటలు) రైల్వేస్టేషన్‌లో ఆగనుంది.
- నెం.66021 మూర్ మార్కెట్ నుంచి రాత్రి 7.20 గంటలకు అరక్కోణం వెళ్లే ఈఎంయూ ఫాస్ట్ లోకల్ ఈగట్టూరు (7.58 గంటలు), సెంజిమనంబాక్కం (8.06 గంటలు), పులియమంగళం (8.25) రైల్వేస్టేషన్లలో ఆగుతుంది.

వరద బాధితులకు ఆహారం



కొనపేటలో ఆహారం అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాను కారణంగా జిల్లాలో రెండు రోజులుగా భారీవర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయం కాగా కొన్ని చోట్ల ఇళ్లలో నీరు ప్రవేశించింది. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్, ఆదివారం 100 మందికి ఆహారం అందజేశారు.

తుఫాను హెచ్చరికపై ఎస్ఎంఎస్‌లు

● రెవెన్యూ శాఖ మంత్రి సాతూర్ రామచంద్రన్

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాను, భారీవర్షాలకు సంబంధించి ముందు జాగ్రత్త చర్యల కింద సుమారు రెండు కోట్ల మందికి ఎస్ఎంఎస్ పంపించినట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ పేర్కొన్నారు. ఎళిలగంలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ కంట్రోల్ రూమ్‌ను ఆదివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... వాతావరణ కేంద్రం హెచ్చరికలతో తుఫాను, భారీవర్షాలపై సముద్రతీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. కోస్తా తీరప్రాంతాల్లో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించినందువల్ల ప్రాణనష్టం జరగలేదన్నారు. చెంగల్పట్టు, విల్లుపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాల్లో వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన ప్రజలను తరలించి, వారిని అన్ని సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు. సహాయ చర్యలు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

4వ తేదీ వరకు ఊటీ రైలు రద్దు

వేళచ్చేరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఊటీ కొండ రైలు సేవలు సోమవారం నుంచి 4వ తేది వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కోయంబత్తూర్, నీలగిరి జిల్లాల్లో నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో, ముందు జాగ్రత్త చర్యలుగా ఊటీ కొండ రైలు సేవలు 4వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యాటకులు గమనించాలని అధికారులు కోరారు.



వేలూరు జిల్లా గుడియాత్తం మున్సిపాలిటీ 7వ వార్డు పరిధి భువనేశ్వరిపేటలో చేపట్టిన వర్షపునీరు తొలగింపు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే అములు విజయన్, యూనియన్ చైర్మన్ సత్యానందం, కమిషనర్ మంధైకరసన్ తదితరులు

స్టాలిన్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

● మాజీ సీఎం ఎడప్పాడి

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విపక్షాల విమర్శలపై అహంకారంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దౌర్జన్యాల వల్ల శాంతి భద్రతలు క్షీణించాయని, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని పళనిస్వామి ఇటీవల విమర్శించారు. వాటి గురించి పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానం చెబుతూ విపక్ష పార్టీల నేతలకు డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా మారిందని, ఈ విమర్శలను తాము పట్టించుకోబోమని మందలింపు ధోరణిలో అన్నారు. సీఎం వ్యాఖ్యలపై స్పందించిన ఈపీఎస్, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విపక్షాలు చేసే విమర్శలను సలహాగా తీసుకొని వాటిని పరిష్కరింపజేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.

వేదారణ్యంలో ఉప్పు ఉత్పత్తి



ఉప్పు ఉత్పత్తి పనుల్లో కార్మికులు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపం అగస్తియన్‌పల్లి, కోట్టియకాడు, కడినల్‌వాయల్ తదితర ప్రాంతా ల్లో 9,000 ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి జరుగుతోంది. రెండు నెలల క్రితం చేసిన ఉప్పును తాటాకాలు, కొబ్బరి ఆకులతో కప్పి భద్రం చేశారు. నెలరోజులుగా ఈశాన్య రుతుపవనాల కారణంగా జిల్లాలో భారీవర్షాలు కురుస్తుండడంతో ఉప్పు ఉత్పత్తి తాత్కాలికంగా నిలిపివేశారు. వర్షాల కారణంగా ఉప్పు మళ్లు చెరువులను తలపిస్తున్నాయి. మళ్లలో నీరు తగ్గడంతో గత నెల 20వ తేది ఉప్పు ఉత్పత్తి ప్రారంభించిన నేపథ్యంలో, 23వ తేది నుంచి మళ్లీ వర్షాల కారణంగా ఉత్పత్తి నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాలు. మళ్లలో నీరు తగ్గడంతో ఏడు రోజుల అనంతరం ఆదివారం నుండి ఉప్పు ఉత్పత్తి ప్రారంభించడంతో, వందలాది మంది కార్మికులతో ఉప్పు మళ్లు సందడిగా మారాయి.

ఆలయంలో ఎలుగుబంటి



ఎలుగుబంటి సంచరించిన సీసీ ఫుటేజీ

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కలక్కాడు సమీపంలోని పెరుమాళ్‌కుళం గ్రామంలో కొద్దిరోజులుగా రాత్రి వేళ ఎలుగుబంటి సంచరిస్తోంది. శుక్రవారం రాత్రి గ్రామంలోని ఆలయంలో ఎలుగుబంటి సుమారు గంట పాటు సంచరించింది. ఈ దృశ్యాలు ఆలయ ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో నమోదైంది. గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబండిని బంధించాలని గ్రామస్తులు అటవీ శాఖకు విజ్ఞప్తి చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే నందకుమార్ ఉత్తర్వులతో ఆనైకట్టు కేంద్ర యూనియన్ సెక్రటరీ పి.వెంకటేశన్ అధ్యక్షతన ఈ శిబిరం జరిగింది. శిబిరం ఏర్పాట్లను ఆనైకట్టు యూనియన్ కమిటీ అధ్యక్షుడు బాస్కరన్, మాజీ పంచాయతి అధ్యక్షులు పర్యవేక్షించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. వారిలో శస్త్రచికిత్స అవసరమైన 25 మందికి రామచంద్ర కంటి ఆసుపత్రిలో ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆండాల్ విగ్రహ ప్రతిష్ఠ



వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలయార్‌కార వీధిలో ఉన్న రుక్మిణి సమేత పాండురంగస్వామి భజన మండలి ఆలయంలో ఉత్సవమూర్తి ఆండాల్ నాచ్చియార్ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఊరేగింపు, పాండురంగన్ వద్ద ప్రార్థనలు, యాగశాల ప్రవేశం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగాయి. భజన మండలి నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

స్టేషన్‌లో పూజలు.. సీఐ బదిలీ

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఏత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు అధికమవుతున్నాయని ఆరోపణలున్నాయి. దీంతో ఏత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు తగ్గాలంటూ కొద్దిరోజుల క్రితం పూజలు చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా పోలీసులు యంత్రాంగం, ఏత్తాపూర్ సీఐ కుమార్‌ను సేలం సాయుధదళ విభాగానికి తాత్కాలికంగా బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

ఏనుగు దంతాలతో ముగ్గురి అరెస్ట్



ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పెరుంబారై సమీపంలో ఏనుగు దంతాలు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఉత్తర్వులతో వత్తలగుండు రేంజర్ రామ్‌కుమార్ నేతృత్వంలో పెరుంబారై, సిద్ధరేవు, వత్తలగుండు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వత్తలగుండు పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా నిలబడి ఉండడంతో అటవీ శాఖ అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇందులో, వారు కోవై జిల్లా వాల్పారైకి చెందిన శశికుమార్ (36), జయరామన్ (74), చెల్లదురై (49) అని తెలిసింది. వారి సంచిలో రెండు ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకొని, ముగ్గురిని ఆదివారం ఉదయం అరెస్ట్ చేశారు.

యథావిధిగా విద్యుత్ రైళ్లు

ప్యారీస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాను తీరం దాటిన నేపథ్యంలో, విద్యుత్ రైళ్లను యథావిధిగా నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. నగరం, శివారు ప్రాంతాల్లో రెండు రోజులుగా కురిసిన భారీవర్షాలకు పలు ప్రాంతాల్లోని రైలుమార్గంలో పట్టాలపై వర్షపు నీరు చేరింది. దీంతో చెన్నై బీచ్-తాంబరం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి, చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్ మార్గాల్లో రైళ్ల సేవలకు అంతరాయం ఏర్పడింది. బీచ్-చెంగల్పట్టు మధ్య శనివారం ఉదయం ఆలస్యంగా సబర్బన్ రైళ్లు నడుపగా, ఆదివారం ఉదయం యథావిధిగా నడిచాయి. ఇదే విధంగా చెన్నై-తిరువళ్లూర్, గుమ్మిడిపూండి తదితర మార్గాల్లో తక్కువ వేగంతో రైళ్లు నడిపారు. తుఫాను తీరం దాటుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో బీచ్-వేళచ్చేరి మధ్య శనివారం నిలిపివేసిన ఎమ్మార్టీఎస్ రైళ్లు ఆదివారం యథావిధిగా నడిపినట్లు అధికారులు తెలిపారు.

అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌కు బ్రేక్ ఫెయిల్

వేళచ్చేరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాంబరం-నాగర్‌కోయిల్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం మదురై నుంచి తిరుమంగళం వస్తుండగా, 'బ్రేక్ రిలీజ్' అవకుండా జామ్ అవడంతో తిరుమంగళం రైల్వేస్టేషన్‌లో ఉదయం 8.50 గంటలకు నిలిచిపోయింది. మదురై నుంచి వచ్చిన ఇంజనీర్ల బృందం మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో, మరో ఇంజన్ రప్పించి బోగీలు అనుసంధానం చేసి మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

● డ్రైవర్ సస్పెండ్



పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపిన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. తిరునల్వేలి నుంచి శనివారం ఉదయం తెన్‌గలంపుదూర్‌కు ప్రభుత్వ టౌన్ బస్సు బయల్దేరింది. ఈ బస్సు డ్రైవర్ గణేశన్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సు నడిపినట్లు సమాచారం. బస్సు రోడ్డుపై నుంచి సమీపంలోని పొల్లాలోకి వెళ్లడంతో గమనించిన డ్రైవర్ గణేశణ్ బ్రేక్‌వేసి బస్సు నిలిపివేశాడు. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలి 20 మందికి స్వల్పగాయాలయ్యాయి. విచారణ చేపట్టిన రవాణా శాఖ అధికారులు, గణేశన్‌ను సస్పెండ్ చేశారు.

వరద బాధితులకు లయన్స్ క్లబ్ వితరణ



బాధితులకు సహాయాలు అందజేస్తున్న మురుగన్, కన్నన్

వేళచ్చేరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పమ్మల్‌లో వరద ప్రాంతాల బాధితులకు విస్టం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఆహార పొట్లాలు అందజేశారు. సమాజ సేవకుడు, మాంబలం లయన్ ఎం.మురుగన్ నేతృత్వంలో సరుకులు అందజేశారు. పసుమై తాయగం లయన్ ఎన్.కన్నన్, లయన్ శక్తివేల్, లయన్ వడివేలు, లయన్స్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బాధితురాలికి అన్నాడీఎంకే నేతల చేయూత



బాధితురాలికి సహాయం చేస్తున్న అన్నాడీఎంకే నేత జయవేలు

తిరుత్తణి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పళ్లికట్టు పడమర వీధిలోని గౌరి అనే మహిళ ఇల్లు కూలింది. ఈ విషయం తెలుసుకున్న అన్నాడీఎంకే పట్టణ కార్యదర్శి పి.జయవేల్ ఆ ఇంటికి వెళ్లి గౌరికి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట నేతలు ప్రకాష్, నాగేంద్రన్, కమల్, ఆనందబాబు, ఢిల్లీ బాబు, దినేష్, ధాము, మాజీ కౌన్సిలర్ కుపారెడ్డి ఉన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం



తిరుత్తణి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఫెంగల్' తుఫాను కారణంగా తిరుత్తణి పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. ఈ గాలులకు పళ్లిపట్టు-షోలింగర్ రహదారి సమీపంలో ఉన్న 50 ఏళ్ల చింత చెట్టు కూలిపడింది. దీంతో ఆ మార్గంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పళ్లిపట్టు హైవే డిపార్ట్‌మెంట్ ఏడీఈ సురేష్, ఏఈ నరసింహన్ నేతృత్వంలో సిబ్బందితో అక్కడకు చేరుకొని చెట్టును తొలగించి, వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

మాల్స్‌లో పార్కింగ్ చార్జీ బాదుడు

పెరంబూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లోని పలు మాల్స్ ప్రాంగణాల్లో 200 నుంచి 500 ద్విచక్రవాహనాలు, 150 నుంచి 400 నాలుగు చక్రాల వాహనాలు పార్కింగ్ చేసే స్థలాలున్నాయి. సాధారణ రోజుల్లో కార్లకు నాలుగు గంటలకు రూ.100-రూ.200 వసూలుచేస్తుంటారు. రెండు రోజులుగా 'ఫెంగల్' ప్రభావంతో పలువురు తమ వాహనాలను సమీపంలో మాల్స్‌లో పార్కింగ్ చేశారు. ఇదే అదనుగా సాధారణ చార్జీలకు బదులు రూ.500 వరకు వసూలుచేశారు.



స్వాసిక

'లబ్బర్ పందు' హీరోయిన్‌కు
లక్కీఛాన్స్!

'లబ్బర్ పందు' వంటి హిట్ చిత్రంలో నటించిన మలయాళ నటి స్వాసికకు లక్కీ ఛాన్స్ వరించింది. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య హీరోగా నటించే 45వ చిత్రంలో ఆమెను ఓ ముఖ్య పాత్రకు ఎంపిక చేసినట్టు చిత్ర యూనిట్ వర్గాల సమాచారం. ఈ సినిమా షూటింగ్ తాజాగా కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలోని మాసాణి అమ్మన్ ఆలయంలో ప్రారంభమైంది. ఇందులో ఒక ముఖ్య పాత్ర కోసం స్వాసికను ఎంపిక చేశారు. బుల్లితెర యాంకర్‌గా రాణించిన స్వాసిక 2009లో తమిళంలో వచ్చిన 'వైగై' మూవీలో ఉమ అనే పాత్ర ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత తమిళం, మలయాళ, తెలుగు (ఎటు చూసినా నువ్వే) భాషా చిత్రాల్లో నటిస్తున్నారు. అయితే, ఆమెకు సరైన బ్రేక్ లేకపోవడంతో పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే, ఇటీవల వచ్చిన 'లబ్బర్ పందు' సూపర్ డూపర్ హిట్ కావడంతో ఆమెకు వరుస అవకాశాలు వరిస్తున్నాయి. ఈ కోవలోనే సూర్య-45లో ఛాన్స్ దక్కిందని చెప్పొచ్చు.

అలా ఎందుకు జరిగిందంటే...



విఘ్నేష్ శివన్ - అజిత్

అగ్రహీరో అజిత్ కుమార్ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం వస్తే మాత్రం ఏ దర్శకుడూ వదులుకోరు. కానీ విఘ్నేష్ శివన్ మాత్రం ఆ అవకాశాన్ని చేజార్చుకున్నారు. అజిత్‌ను డైరెక్ట్ చేసే అవకాశాన్ని ఓ నిర్మాత కారణంగా కోల్పోయారు. ఇలా ఎందుకు జరిగిందో ఆయన తాజాగా వివరించారు. 'నేను దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీ దాన్' చిత్రం అజిత్‌కు ఎంతగానో నచ్చింది. ఆ సమయంలో ఆయనను కలిశాను. అనేక విషయాలు మాట్లాడుకున్నాం. 'పెద్దగా సినిమాలు చూడనని, కానీ 'నానుమ్ రౌడీ దాన్' చిత్రం చూడగా, ఎంతగానో నచ్చిందని, ముఖ్యంగా పార్తిబన్ పాత్ర బాగుందని చెప్పారు. ఆ సమయంలోనే ఒక స్క్రిప్టు సిద్ధం చేసి తీసుకొస్తానని అజిత్‌కు మాట ఇచ్చాను. ఆ మాట ప్రకారమే కథను సిద్ధం చేసి అజిత్‌ను కలిసి.. మీ స్టైల్‌లో ఒక చిత్రం చేద్దామని చెప్పాను. కానీ, అజిత్‌తో సినిమా తీసే నిర్మాతకు మాత్రం మరో స్టైల్‌లో మూవీ కావాలని కోరారు. అదీకూడా పెద్ద హీరోతో సినిమా చేసేటపుడు అన్ని అంశాలుండాలని సూచించారు. నాకేం అర్థంకాలేదు. నేను రాసిన కథ ఆ నిర్మాత అంచనాలకు భిన్నంగా ఉంది. పైగా నా స్క్రిప్టు మలయాళంలో ఆ సమయంలో విడుదలైన 'ఆవేశం' సినిమాకు దాదాపు అటూ ఇటూగా ఉంది. నేను కూడా అనేక మాస్ ఎలిమెంట్స్‌తోనే స్క్రిప్టు సిద్ధం చేశాను. కానీ, నిర్మాతకు అది నచ్చలేదు. ఎమోషనల్, మెసేజ్ లేదని చెప్పారు. అలా అజిత్‌ను డైరెక్ట్ చేసే అవకాశాన్ని కోల్పోయాను' అంటూ విగ్నేష్ నిర్వేదాన్ని వ్యక్తం చేశారు.

చిత్రజ్యోతి



'రాజాకిలి'లో ఓ దృశ్యం

వరుస చిత్రాల్లో సముద్ర ఖని

దర్శకుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్, విలన్ ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ప్రముఖ నటుడు సముద్రఖని వరుస చిత్రాల్లో హీరోగా నటిస్తున్నారు. తెలుగు చిత్రాల్లో ప్రధాన విలన్ పాత్రలను పోషించే ఆయన.. తమిళంలో మాత్రం కొన్ని చిత్రాల్లో హీరో, మరికొన్ని చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ కోవలోనే ఆయన హీరోగా నటించిన 'రాజాకిలి'తో పాటు మరో చిత్రం వచ్చే నెలలో విడుదలకానుంది. నటుడు తంబిరామయ్య కుమారుడు ఉమాపతి రామయ్య దర్శకత్వం వహించిన 'రాజాకిలి'లో డిసెంబరు 13వ తేదీ విడుదల చేయనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఆ తర్వాత డిసెంబరు 20న సముద్రఖని, భారతీరాజా, అనన్య, తంబి రామయ్య నటించిన 'తిరు మాణిక్యం' విడుదలకానుంది. ఇదిలావుంటే, 'రాజాకిలి' చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి సమర్పణలో 'వి హౌస్' పతాకంపై తెరకెక్కింది. కథ, మాటలు, పాటలు, సంగీతాన్ని తంబి రామయ్య అందించడం ఈ చిత్ర ప్రత్యేకత. ఇటీవలే ఆడియోతోపాటు ట్రైలర్‌ను రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది.

తిరువణ్ణామలై దీపోత్సవాలకు
భారీ ఏర్పాట్లు

- 3,408 ప్రత్యేక బస్సులు... 25 తాత్కాలిక బస్టాండ్లు
- నేడు ధ్వజారోహణం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భాస్కర పాండ్యన్

వేలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ భాస్కర పాండ్యన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఎస్పీ సుధాకర్, కో-ఆప్‌టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ ఉత్సవాలపై సమీక్షించారు. దీపోత్సవాల సమయంలో నిత్యావసర సౌకర్యాలను ఆర్గనైజింగ్, తాత్కాలిక బస్టాండ్లు, ఆలయ ప్రాంగణం, గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యవేక్షణ పనులకు సూపర్‌వైజర్లను నియమించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంతాలు, గిరి ప్రదక్షిణ మార్గంలో ఆక్రమణలకు తొలగించి రహదారి దుకాణాలను క్రమబద్ధీకరించాలని, కొండ పైకి వెళ్లే 2,500 మంది భక్తులకు ప్రవేశ టిక్కెట్లు, కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నగరంలో 500 మీటర్లకు ఆరుగురు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. 50 ప్రాంతాల్లో సహాయ కేంద్రాలు, నగరం, ముఖ్యప్రాంతాల్లో 700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రవాణా శాఖ తరఫున 9 ప్రధాన రహదారుల్లో 25 తాత్కాలిక బస్టాండ్లు, 120 కార్లు నిలిపేలా పార్కింగ్ కల్పించనున్నారు. అలాగే, 3,408 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. రవాణా శాఖ నిర్ణయించిన ఛార్జీలు మాత్రమే వాహనచోదకులు వసూలుచేయాలని, అధిక ఛార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. గిరిప్రదక్షిణలో 8 ప్రాంతాల్లో 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధీకరణ కేంద్రాలు, నగరంలో విద్యుత్ కొరత లేకుండా జనరేటర్ల ఏర్పాటు తదితరాలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో డీఆర్వో రామప్రదీపన్, పథక అధికారి మణి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో అరుణాచలేశ్వర స్వామి ఆలయం

పుదుచ్చేరిలో ఆర్మీ సహాయక చర్యలు







వర్షబాధితులను బోటులో పునరావాస కేంద్రానికి తరలిస్తున్న సైనికులు



పుదుచ్చేరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో కురిసిన అతి భారీవర్షాలకు జనజీవనం స్తంభించింది. శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరం జలమయమైంది. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి విజ్ఞప్తి మేరకు మేజర్ అజయ్‌సవాల్ నేతృత్వంలో ఆరుగురు జూనియర్ అధికారులు, 62 మంది సైనికుల బృందం ఆదివారం ఉదయం చెన్నై నుంచి పుదుచ్చేరి చేరుకుంది. ఆ రాష్ట్రంలోని కృష్ణానగర్‌లో నీటమునిగిన ఇళ్ల నుంచి బాధితులను పడవల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. పుదుచ్చేరిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం కూడా కురిసిన వర్షానికి సుమారు ఐదడుగుల మేర నిలిచిన వరద నీటిలో చిక్కుకున్న సుమారు వంద మందికి పైగా ప్రజలను సైనికులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

పూర్తిస్థాయిలో సహాయక చర్యలు : పుదుచ్చేరి సీఎం రంగస్వామి

పుదుచ్చేరిలో వర్షబాధిత ప్రాంతాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆదివారం మంత్రులు, అధికారులతో కలసి పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలను పలకరించి వారికి ప్రభుత్వం తరఫున అందజేస్తున్న సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రంగస్వామి మీడియాతో మాట్లాడుతూ... వాతావరణ కేంద్రం ముందుగా చేసిన హెచ్చరికలతో రాష్ట్రంలో లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టినట్లు తెలిపారు. 1971వ సంవత్సరంలో 31 సెం.మీ వర్షపాతం నమోదైందని, ప్రస్తుతం దాదాపు 50 సెం.మీ మేర కురిసిన వర్షంతో రాష్ట్రం తీవ్ర ఇబ్బందుల పాలైందన్నారు. అమావాస్య కావడంతో సముద్రంలో అలజడి అధికంగా ఉందని, అందువల్ల వర్షపు నీరు సముద్రంలో చేరకపోవడంతో పలు నివాస ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు.







పళనిలో దర్శనం కోసం బారులుదీరిన భక్తులు- తిరుచెందూరు ఆలయం వద్ద రద్దీ - తిరుచెందూరు ఆలయం వద్ద సముద్రం వెనక్కిమళ్లటంతో బయపడ్డ నాచు

పళని, తిరుచెందూరులో భక్తుల రద్దీ

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రమైన పళని పర్వతాలయంలో ఆదివారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం బారులు తీరారు. పర్యాటకులు, భక్తులే కాకుండా అయ్యప్ప భక్తులు కూడా అధిక సంఖ్యలో పళని క్షేత్రానికి విచ్చేశారు. కేరళ నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో వచ్చారు. రోప్‌కార్ ప్రాంతం, పర్వతాలయ దిగువ ప్రాంతం, అన్నదానకూడం, తలనీలాలు సమర్పించే ప్రాంతం తదితర ప్రాంతాల వద్ద భక్తుల సందడి అధికమైంది.

తిరుచెందూరులో..

తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రమణ్యస్వామి వారి ఆలయానికి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచి వందల సంఖ్యలో భక్తులు సముద్రంలో, నాళికినరు వద్ద స్నానమాచరించి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయాన్ని వేకువజాము 4 గంటలకే తెరచి 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, ఆరు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయ వెనుకనున్న సముద్రంలో అమావాస్య ఆటుపోట్లు అధికమయ్యాయి. రెండు రోజులుగా వెనక్కి మళ్ళిన అక్కడి సముద్రం ఆదివారం వేకువజాము కూడా సుమారు 60 అడుగుల దూరం వరకు వెనక్కి మళ్ళింది. దీంతో తీరంలోని నాచు అంతా బయటపడింది.









వేళచ్చేరిలో వాననీటిలో మొరాయించిన వాహనాలను నెట్టుకుంటూ వెళ్తున్న స్థానికులు - వేళచ్చేరిలో వాననీటిని మోటారు పంపు ద్వారా తొలగిస్తున్న కార్పొరేషన్ కార్మికులు - కోడంబాక్కం వద్ద నీటితో నిండిన సబ్‌వేపైని కాలువ - పుదుచ్చేరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి చేరిన వరద నీరు


దిశ మారిన తుపాను ... రాజధానికి తప్పిన ముప్పు

- తేరుకుంటున్న శివారు ప్రాంతాలు



పుదుచ్చేరి మెయిన్‌రోడ్డులో నిలిచిన వాన నీరు

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావిత భారీ వర్షాలతో తల్లడిల్లిన రాజధాని నగరం చెన్నై క్రమంగా కోలుకుంటోంది. ఈ తుఫాన్ చివరి క్షణంలో దిశ మార్చుకోవడంతో నగరానికి పెనుముప్పు తప్పింది. వాతావరణ కేంద్రం అధికారుల అంచనా ప్రకారం ఈ తుఫాన్ మహాబలిపురం వద్ద తీరం దాటడానికి బదులు రూటు మార్చుకుని పుదుచ్చేరి వద్ద తీరాన్ని దాటింది. అయితే తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు సుమారు 350 ప్రాంతాల్లో వరద పొంగి వాహనాల రాకపోకలకు స్తంభించాయి. వేళచ్చేరి, రాయపురం, మనలి, అడయార్, తాంబరం, ఆవడి, మధురవాయల్, పూందమల్లి తదితర శివారు ప్రాంతాలన్నీ దీవులుగా మారాయి. ఈ ప్రాంతాలలో ఆదివారం వేకువజాము నుంచి వర్షాలు ఆగిపోవటంతో రహదారుల్లో వాననీరు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయితే ఆదివారం సాయంత్రం వరకు కోడంబాక్కం, మదురవాయల్, కోయంబేడు, వడపళని తదితర ప్రాంతాల్లోని వీధుల్లో ఇంకా నీరు తగ్గలేదు. ఇక గిండి సమీపంలోని రహదారులు, ఆలందూరు, వేళచ్చేరి, సైదాపేట, తిరువాన్మియూరు, బీసెంట్‌నగర్ ప్రాంతాల్లోని కొన్ని వీధుల్లో కూడా వాననీటితో మురుగునీరు కలిసి ప్రవహిస్తోంది. ఇదిలా ఉండగా శనివారం మూతపడిన మీనంబాక్కం అంతర్జాతీయ, జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులు ఆదివారం వేకువజామునే ప్రారంభమయ్యాయి. పెనుగాలుల కారణంగా నగరంలో కూలిన చెట్లను కూడా కార్పొరేషన్ అధికారులు సకాలంలో తొలగించారు. నగరంలోని గణేష్ పురం సబ్‌వే, మేడ్లీ సబ్‌వేలను తాత్కాలికంగా మూసివేశారు. తక్కిన వాటిలో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో 216 వంటశాలల ఏర్పాటు చేసిన 2.75 మంది బాధితులకు ఆహార పొట్లాలను అందించారు.



పుదుచ్చేరిలో ఓ చిన్నారిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సైనికులు



మోహన్‌నగర్‌లో బాధితులను సురక్షిత ప్రాంతానికి తీసుకెళుతున్న సైనికుడు

వర్ష బాధితులను ఆదుకుంటాం

- సొంత నియోజకవర్గంలో పర్యటించిన సీఎం స్టాలిన్



కొళత్తూరు జీకేఎం కాలనీ కొలనును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం అయ్యాయని, బాధితులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సొంత నియోజకవర్గమైన కొళత్తూరులో వర్షబాధిత ప్రాంతాలను అధికారులు, మంత్రివర్గ సహచరులతో కలిసి పరిశీలించారు. కొళత్తూరు సెల్వినగర్ ప్రాంతంలో వాననీటిని తొలగించే కేంద్రాన్ని సందర్శించి, శీనివాసన్ నగర్ పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న చికిత్సలు, సదుపాయాలు గురించి వైద్యుల వద్ద అడిగి తెలుసుకున్నారు. జీకేఎం కాలనీలోని సీఎండీఏ నిర్వహిస్తున్న మురుగునీటి తొలగింపు కేంద్రాన్ని, అదే ప్రాంతంలో 'ఏ' రోడ్డులో ఉన్న కొలను మరమ్మతు పనులను తనిఖీ చేశారు. పెరియార్ నగర్ ప్రభుత్వ సబర్బన్ ఆసుపత్రిలో జనరేటర్ పనిచేసేలా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించారు. స్టాలిన్‌తోపాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు కళానిధి వీరాసామి, ఆర్ గిరిరాజన్, మేయర్ ఆర్ ప్రియా, కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పర్యటించారు.



కంట్రోల్ రూమ్ నుండి విల్లుపురం, కడలూరు జిల్లాల్లో సహాయక చర్యలు చేపడుతున్న మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి